## క్లుప్తంగా

### చింతలాయిపల్లె వాసికి అవార్డు


నాగరాజు

కొలిమిగుండ్ల: చింతలాయిపల్లె గ్రామానికి చెందిన నాగరాజు పాన్ఇండియా ఐకానిక్ 2025 టీచర్స్ అవార్డు పొందారు. ఆదివారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు ఆయనకు అవార్డును అందజేశారు. తాడిపత్రి పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో గణిత బోధన చేస్తూ 25 ఏళ్లుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న నాగరాజు కృషిని గుర్తించి జ్యూరీ అవార్డుకు ఎంపిక చేసింది. పలు రాష్ట్రాల ప్రైవేట్ పాఠశాలల నుంచి ఉత్తమ బోధన చేసిన ఉపాధ్యాయులను ఈ అవార్డుతో సత్కరించారు. గ్రామపెద్దలు, స్థానికులు ఆయనను అభినందించారు.

### రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

బేతంచెర్ల: మండలంలోని రౌడీషీటర్లు నేరజీవితం మానుకుని సత్ప్రవర్తనతో మెలగాలని సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లు, అనుమానితులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గతంలో క్షణికావేశంలో చేసిన తప్పులను పునరావృతం చేయకుండా మంచి జీవనం గడపాలని వారికి సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్ బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆలయానికి లైటింగ్ డెకరేషన్ విరాళం


లైటింగ్ డెకరేషన్ విద్యుత్ దీపాలను అందజేస్తున్న దాత

కోవెలకుంట్ల: స్థానిక అంకాలమ్మ చౌరస్తాలో వెలసిన మారెమ్మ ఆలయానికి దాతలు ఆదివారం లైటింగ్ డెకరేషన్ విద్యుత్ దీపాలను విరాళంగా అందజేశారు. దసరా మహోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 22వ తేదీ నుంచి జరిగే ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని ఎల్ఎం కాంపౌండ్‌కు చెందిన మాలే పెద్దరంగడు, రాజమ్మ కుమారుడు చిన్నపాండురంగడు, సునంద దంపతులు రూ.35 వేల విలువ చేసే డెకరేషన్ విద్యుత్ దీపాలను ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఉసేనప్ప, మైకేల్, రామసుబ్బయ్య పాల్గొన్నారు.

### ఆర్టీసీ బస్సును ఢీకొన్న ట్యాంకర్


బస్సును ఢీకొన్న ట్యాంకర్

కొలిమిగుండ్ల: ఇటిక్యాల బస్టాప్‌లో ఆగివున్న ఆర్టీసీ బస్సును ఆదివారం సిమెంట్ ట్యాంకర్ ఢీకొంది. జమ్మలమడుగు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తాడిపత్రికి వెళుతున్న క్రమంలో ప్రయాణికుల కోసం ఇటిక్యాల బస్టాప్‌లో ఆపారు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న సిమెంట్ ట్యాంకర్ బస్సు ఢీకొనడంతో రెండు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. బస్సు వెనుక భాగాన సైడ్‌కు తగలడంతో ప్రయాణికులు క్షేమంగా బయట పడ్డారు. ప్రధాన రహదారిపై వాహనాలు ప్రమాదానికి గురి కావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

### ముగిసిన ఉర్సు


ఉర్సులో నాట్యం చేస్తున్న గుర్రం

డోన్: పట్టణంలోని కొండపేట చాకిరేవుమిట్ట వద్ద మౌలాలి స్వామి దర్గా ఉర్సు ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. రెండురోజుల పాటు జరిగిన ఉత్సవాల ముగింపు సందర్భంగా పట్టణ వీధుల మీదుగా పక్కీర్లు ఊరేగింపుగా దర్గాకు చేరుకుని చద్దర్ సమర్పించారు. ఈ సందర్భంగా తెల్లగుర్రం వేసిన నాట్యం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది.

### 22న రైతుల సమస్యలపై ధర్నా

బేతంచెర్ల: రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు తెలిపారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో మండల కార్యదర్శి రామ్‌మోహన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. పాసుపుస్తకాలు, పట్టాలు ఉన్నా ఈనామ్, చుక్కల భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తించడంలేదని తెలిపారు. ధర్నాకు రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.


అయ్యల చెర్వు రహదారిపై నీరు


డోన్ రహదారిలోని హెచ్ కొట్టాల వద్ద..


బుగ్గానిపల్లె గ్రామంలో..

# చినుకు పడితే చెరువే!

పట్టణంలోని కర్నూలు–నంద్యాల క్రాస్ రోడ్డుతో పాటు బనగానపల్లె, డోన్ రోడ్లలో వర్షం కురిసినప్పుడల్లా రహదారులపై నీరు నిలిచి కుంటలను తలపిస్తోంది. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన రహదారులు దెబ్బతినే ప్రమాదం ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కర్నూలు–నంద్యాల క్రాస్ రోడ్డులో ఇరువైపులా నీరు నిలవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. –బేతంచెర్ల


కర్నూలు–నంద్యాల క్రాస్ రోడ్డులో రహదారిపై నిలిచిన వర్షపు నీరు

# రోడ్లు వేశారు.. డ్రైనేజీలు మరిచారు!


బీసీ కాలనీకి వెళ్లే రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపునీరు,


ఎస్సీకాలనీలో డ్రైనేజీ లేక సీసీరోడ్డుపై చేరిన నీరు

కోవెలకుంట్ల: మండలంలోని పొట్టిపాడులోని పలు కాలనీల్లో సీసీరోడ్లు నిర్మించినా, వాటికి అనుసంధానంగా డ్రైనేజీలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో ఐదు నెలల క్రితం సీసీరోడ్లు నిర్మించారు. అయితే రోడ్లకు మురుగునీరు పారే కాల్వలు లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే ఇళ్లలోని మురుగు, వర్షపు నీరు రోడ్లపై చేరుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో సీసీరోడ్లపై నీరు నిలిచి, ప్రజల రాకపోకలు కష్టమయ్యాయి. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు బురదనీటిలో నడవాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని సీసీరోడ్లకు అనుసంధానంగా డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



నాడు: గోసానిపల్లెలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు, నేడు: రోడ్డుపై గ్రావెల్ వేసిన తర్వాత ఇలా..

# మురుగునీటి సమస్యకు పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్

డోన్: మండలంలోని గోసానిపల్లె గ్రామంలో ప్రధాన రహదారిపై నిల్వ ఉన్న మురుగునీరు, అపరిశుభ్ర పరిస్థితులకు పరిష్కారం లభించింది. 'ఇంటింటా జ్వరాలు' అనే శీర్షికతో ఈనెల 7వ తేదీ సాక్షి పత్రికలో ప్రచురితమైన వార్తపై పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పందించారు. గ్రామంలో మురుగునీరు నిల్వ ఉండడంతో దోమల వ్యాప్తి అధికమై గ్రామస్తులు విషజ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారని వార్తలో పేర్కొనగా, సమస్యను పరిష్కరించేందుకు అధికారులు ముందుకొచ్చారు. మెటల్ రోడ్డుకు మొరుసు వేయించి పునర్నిర్మించడంతో మురుగునీరు, దుర్వాసనతో పాటు దోమల సమస్య కూడా తగ్గిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

### రస్తా స్థలంలో అక్రమ బంక్‌లు

డోన్ టౌన్: ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా ఇటీవల ఏర్పాటు చేసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిసరాల్లో వ్యాపార సముదాయాలు వరుసగా వెలుస్తున్నాయి. అయితే కొందరు అక్రమార్కులు రిజిస్ట్రార్ కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ భూములు, వంక పోరంబోకు స్థలాలు, రహదారుల కోసం వదిలిన ప్రదేశాలను కబ్జా చేసి బంకులు ఏర్పాటు చేస్తున్నారు. వాటిని అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. సర్వే నంబరు 320లో ఉడుములపాడు చెరువుకు వెళ్లే వంక పక్కన అపార్ట్‌మెంట్‌కు వదిలిన 12 అడుగుల రస్తాను ఆక్రమించి యథేచ్ఛగా బంకులు ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, పట్టణ ప్రణాళిక శాఖ అధికారులు పరిశీలించినప్పటికీ, బంకులను తొలగించే చర్యలు మాత్రం తీసుకోకపోవడం ప్రజల్లో అనుమానాలు రేకెత్తిస్తోంది. బంకులు ఏర్పాటు చేసిన వారు టీడీపీ నాయకులు కావడంతోనే అధికారులు మౌనం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జోక్యం చేసుకుని భూములను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.


కాలువ పక్కన ఏర్పాటు చేసిన బంక్‌లు

### ధ్యానంతో మానసిక ఆరోగ్యం


ప్రసంగిస్తున్న గురూజీ సుధాకర్

డోన్ టౌన్: శారీరక ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు ధ్యానం తప్పనిసరి అని హైదరాబాద్‌కు చెందిన యోగా గురూజీ సుధాకర్ అన్నారు. ఆదివారం సాయంత్రం రైల్వే స్టేషన్ రోడ్డులోని యూనియన్ క్లబ్‌లో యోగా, ప్రాణాయామంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేటి ఆధునిక సమాజంలో మానసిక ఒత్తిడి అనారోగ్యాలకు కారణమవుతోందని, దీన్ని జయించేందుకు యోగా, ధ్యానం ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. సహజ సిద్ధ యోగా శిక్షణా తరగతులు 11 రోజుల పాటు కొనసాగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డోన్ గీతా యోగాసన సంఘం గురూజీ రాంపులయ్య, సభ్యులు ఓలేటి మాధవస్వామి, సప్తశైల తిమ్మయ్య, సాయిబాబా, సరేష్ తదితరులు పాల్గొన్నారు.

### కబడ్డీ పోటీలకు ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): జిల్లా స్థాయి కబడ్డీ జట్టుకు బాల బాలికల ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని పద్మావతినగర్‌లో ఉన్న ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 250 మంది బాలురు, బాలికలు పాల్గొన్నారు. వీరిలో 20 మంది బాలురను, 20 మంది బాలికలను కోచింగ్ క్యాంప్‌కు ఎంపిక చేసినట్లు నంద్యాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల మోహన్‌రావు యాదవ్ తెలిపారు. వీరు జిల్లా, అంతర్జాతీయ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా కబడ్డీ సెక్రటరీ సుబ్రమణ్యం, క్రీడా అసోసియేషన్ నాయకులు రామేశ్వరరెడ్డి, ఇప్పా వెంకటేశ్వర్లు, హరికృష్ణ, మమత, రేవతి, తదితరులు పాల్గొన్నారు.

# గాడిచెర్ల సేవలు చిరస్మరణీయం


కోవెలకుంట్ల: గాడిచెర్ల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం


డోన్‌లో..


సంజామల గ్రంథాలయంలో..

- ఘనంగా గాడిచెర్ల జయంతి వేడుకలు

కోవెలకుంట్ల: గ్రంథాలయ పితామహుడు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు 142వ జయంతి వేడుకలను ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ గ్రంథాలయాధికారి నరసింహారెడ్డి, రాయలసీమ స్టూడెంట్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బందెల ఓబులేసు ఆధ్వర్యంలో స్థానిక లైబ్రరీ ఆవరణలో గాడిచెర్ల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి గాడిచెర్ల ఎంతో కృషి చేశారని, స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. 2017లో నంద్యాల మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, దాతల సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ పశువైద్యాధికారి శివారెడ్డి, ప్రకృతిపీఠం సభ్యులు రాములమ్మ, రఫీ, చిదానంద పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

- డోన్: స్థానిక గుత్తిరోడ్డులోని గ్రంథాలయంలో గాడిచెర్ల జయంతిని నిర్వహించారు. గ్రంథాలయ అధికారి రాధాబాయి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆధునిక గ్రంథాలయ పితామహుడు గాడిచెర్లను ఈ తరం యువత విస్మరించడం బాధాకరమని పేర్కొన్నారు. గ్రంథాలయాలు విజ్ఞాన ఖజానాలు అనే భావనను ముందుగా చాటి చెప్పిన గాడిచెర్లను మరువరాదని సూచించారు.
- సంజామల: స్థానిక గ్రంథాలయంలో గాడిచెర్ల జయంతి వేడుకలను నిర్వహించారు. గ్రంథాలయ అధికారి బాలా తిమ్మారెడ్డి మాట్లాడుతూ.. గాడిచెర్ల గ్రంథాలయాల అభివృద్ధికి చేసిన కృషి కారణంగా ఆయనకు 'గ్రంథాలయ పితామహుడు' బిరుదు దక్కిందని వివరించారు.

### వ్యవసాయానికి విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. అమడాల, గుంజలపాడు, జోళదరాశి, గుళ్లదుర్తి, పొట్టిపాడు, హరివరం, అల్లూరు, కొత్తపల్లె, కలుగొట్ల, కొప్పెర్ల, రేవనూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉంటుందని పేర్కొన్నారు.

సంజామలలో..

సంజామల: మండల పరిధిలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాలకు ఈ వారం పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఇన్‌చార్జ్ ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

### నేడు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రాక

ప్యాపిలి: సీపీఐ రాష్ట్రకార్యదర్శి కె. రామకృష్ణ సోమవారం ప్యాపిలి టమాట మార్కెట్‌కు రానున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి మహేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు టమాట మార్కెట్‌లో రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుంటారని పేర్కొన్నారు. గిట్టుబాటు ధరలు లేక టమాట రైతులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకునేందుకు ఆయన వస్తున్నట్లు తెలిపారు.

### 22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు


ఉత్సవాల పుస్తకాలను విడుదల చేస్తున్న ఆర్యవైశ్యులు

బేతంచెర్ల: స్థానిక అమ్మవారిశాలలో వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఈనెల 22 నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుండా గోపాలు, కార్యదర్శి బచ్చు సుబ్రహ్మణ్యం, కోశాధికారి రామూర్తి ఆదివారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఉత్సవాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 22న బాల త్రిపుర సుందరి అలంకరణ చేయనున్నారు. అలాగే 23న గాయత్రి దేవి, 24న అన్నపూర్ణాదేవి, 25న కాత్యాయనీ దేవి, 26న మహాలక్ష్మి దేవి, 27న లలితా త్రిపుర సుందరి, 28న మహా చండీ దేవి, 29న సరస్వతి దేవి, 30న మహిషాసుర మర్దిని, అక్టోబర్ 1న దుర్గాదేవి, 2న రాజరాజేశ్వరి దేవి అలంకరణలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. అక్టోబర్ 2న రథోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు, అక్టోబర్ 3న వసంతోత్సవం, వనభోజనం, రాత్రి తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

### కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్యాపిలి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శివరాం, జిల్లా కమిటీ సభ్యుడు ఏవీ భాస్కర్ రెడ్డి, మండల కార్యదర్శి చిన్న రెహమాన్ విమర్శించారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాల ద్వారా అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు తమ వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. సీఐటీయూ నాయకులు రామాంజనేయులు, లక్ష్మణ్, రంగస్వామి, శ్రీనివాసులు, ఓబులపతి, నరేశ్, మారెన్న పాల్గొన్నారు.

### విద్యార్థులకు చేయూత


విద్యార్థులకు నగదు ప్రోత్సాహాన్ని అందజేస్తున్న సంఘం నేతలు

డోన్ టౌన్: విద్యాతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఆర్యవైశ్య సంఘం నాయకులు అన్నారు. స్థానిక అమ్మవారిశాలలో ఆదివారం సాయంత్రం ఆవోపా, ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో వాసవీ విద్యా చేయూత పథకం కింద 28 మంది నిరుపేద విద్యార్థులకు రూ.2.16 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా మెడికల్ సీటు సాధించిన నిచ్చెనమెట్ల వెంకటసాయి హర్షదీప్, జౌళి రేఖశ్రీలను సత్కరించారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సర్వజ్ఞమూర్తిని సన్మానించారు. కార్యక్రమంలో ఆవోపా, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ మహిళా మండలి తదితర సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

### మిద్దెపల్లెలో కొత్త బోరు


బోరుకు పూజలు చేసిన సర్పంచ్, గ్రామస్తులు

డోన్: ఎద్దుపెంట పంచాయతీ పరిధిలోని మిద్దెపల్లె గ్రామంలో కొత్తగా మంజూరైన మంచినీటి బోరు పనులను ఆదివారం గ్రామ సర్పంచ్ బంగారు జయచంద్ర భూమిపూజ చేసి ప్రారంభించారు. గ్రామ ప్రజల నీటి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కొత్త బోరు మంజూరు చేయించామని సర్పంచ్ తెలిపారు. బోరు తవ్వకంలో రెండు ఇంచుల నీరు పడడంతో గ్రామస్తుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామాంజనేయులు, తిమ్మారెడ్డి, విజేయుడు, పులికొండ, సుంకన్న, రంగన్న, రాముడు తదితరులు పాల్గొన్నారు.